ఇంటింటా ఉగాది శోభ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- పంచాంగ పఠనం గావించిన పండితులు



రెబ్బనపల్లి గ్రామదేవత ధనమ్మ అమ్మవారిని దర్శించుకున్న సర్పంచ్‌లు

అల్లవరం: ఉగాది పర్వదినంను పురస్కరించుకుని ఇంటింటా ఉగాది శోభ కనిపించింది. వాడవాడలా కొత్త సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉగాది సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు కనకదుర్గ, గ్రామ దేవతలను దర్శించుకున్నారు. శోభకృత నామ సంవత్సరంలో ఏడాది పొడువునా సుఖ సంతోషాలుతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని, ఇష్ట దైవాన్ని దర్శించుకున్నారు. బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని రెబ్బనపల్లి ధనమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ తీర్థం చేశారు. కోడూరుపాడు దేశికోడు వంతెన వద్ద సత్తమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. బోడసకుర్రు విజయదుర్గ అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించి ఏకాహం జరిపారు.

వెంకన్న సన్నిధిలో ఉగాది పంచాంగ శ్రవణం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం వేద మంత్రాల నడుమ పంచాంగ పఠనం జరిగింది. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి ముంగిట చేసిన పంచాంగ పఠనం భక్తులు విన్నారు. ఆలయ ధర్మకర్తలు యెండూరి రాఘవ, నడింపల్లి వర్మ, సంసాని అబ్బు, కుసుమ శ్రీను, భరణికాన బాబు, కాశే ఆది పట్టాభిరామయ్య, ముంగర ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం

అమలాపురం టౌన్: రాయుడు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యనగర్‌లో శోభకృత్ తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనం అలరించింది. కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సాహితీవేత్త, మానవతా స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కవులు సంసోను, రెడ్డి బాబు, కరాటం ప్రవీణ్, బాల కవులు శీలి కావ్య, బి.అశ్విన్‌తేజ తదితరులు కవి సమ్మేళనంలో తమ కవితాగానాలు వినిపించారు. అనంతరం కవులను కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు.

పంచాంగకర్తలకు ఉగాది సత్కారాలు

అమలాపురం టౌన్: ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్థానిక బంగారు, వెండి వర్తకుల సంఘ భవనంలో బుధవారం రాత్రి ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమలాపురానికి చెందిన పంచాంగ కర్త, జ్యోతిష్య పండితుడు ఉపద్రష్ట నాగాదిత్య, రూరల్ మండలం బండార్లంక గ్రామానికి చెందిన పంచాంగ కర్త కాలేపు భీమేశ్వరరావులను చాంబర్ వ్యాపార ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, గౌరవాధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, కార్యదర్శి కొమ్మూరి ప్రసాద్, చాంబర్ ప్రతినిధులు కొవ్వూరి వెంకటరెడ్డి, చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ ధ్యాన మందిరంలో ఉగాది వేడుకలు

యానాం: స్థానిక పిరమిడ్ ధ్యానమందిరంలో యానాం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకల్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విశ్రాంత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గూటం శివగణేష్, గోదావరి విభాగ్ ప్రచార్ ప్రముఖ్ నందూరి కృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని ఉగాది వేడుకల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు అన్యం రామకృష్ణారావు, కనకాల రామదాసు, నరహరిశెట్టి అబ్బులు, కొండమూరి భాస్కరరావు, దంగుడుబియ్యం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: శోభకృత నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉంటారని ప్రముఖ పండితులు నాగాభట్ల వీర వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని పంచాంగ పఠనం చేశారు. అనంతరం ఆలయ పండితులు, అర్చకులను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు సత్కరించారు. ఏప్రిల్ 24 నుంచి జరిగే స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణాల కరపత్రాలను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, ధర్మకర్త మండలి సభ్యులు ఆవిష్కరించారు.

తాళ్లరేవు: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేదపండితులు కందికొండ వెంకటకృష్ణయ్య పంచాంగ పఠనం వినిపించారు. ఈ సందర్భంగా కేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో జనహిత ఆర్‌ఎస్ఎస్ కార్యాలయంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం ఉగాది వేడుకలను నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఉగాది పంచాంగ పఠనాన్ని వినిపిస్తున్న వేద పండితులు



పంచాంగ కర్త నాగాదిత్య దంపతులను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు



వీరేశ్వరస్వామి ఆలయంలో పంచాగ పఠనం గావిస్తున్న పండితులు సుబ్రహ్మణ్యశర్మ

క్లుప్తంగా

అర్ధ విపంచి పుస్తకావిష్కరణ



అర్ధ విపంచి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల పరిషత్ సమావేశ మందిరంలో కళాసాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.శివనాగరాజు అధ్యక్షతన బుధవారం శ్రీశోభకృత ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్య, గద్య కవులు తమ కవితలు వినిపించారు. ఈ సందర్భంగా కవి దోనిపాటి సత్యనారాయణ రచించిన 'అర్ధ విపంచి' పుస్తకాన్ని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, పీవీఎస్ వర్మ, పి.విజయ్‌కుమార్, కర్నీడి వెంకటేశ్వరరావు, విత్తనాల వరప్రసాద్, గిడ్డి ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాన్ని త్వరగా నిర్మించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: 600 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని త్వరగా పునర్నిర్మించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూల్చేసి ఏళ్లు గడుస్తున్నా నూతన ఆలయ నిర్మించక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ ఆలయానికి భక్తులు సమర్పించిన బంగారు, వెండి నగలు తదితర విరాళాల వివరాలను ఎక్కడా నమోదు చేయాలేదన్నారు. ఆదాయ, వ్యయాలకు సంబంధించి ఏటా నిర్వహించాల్సిన ఆడిట్‌ను సైతం కమిటీ ఎన్నడూ చేయించలేదన్నారు. దేవస్థానం కమిటీ నుంచి గుడి ఆస్తులను కాపాడాలని, అవకతవకలపై విచారణ చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టును ఆశ్రయించానన్నారు. తక్షణం ఆలయ రికార్డులను పరిశీలించి స్వామివారి ఆభరణాలు, ఆదాయాలపై నిష్పక్షపాతంగా ప్రభుత్వం విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

శాకంబరి అలంకరణలో శారదాదేవి



శాకంబరి అలంకరణలో శారదాదేవి అమ్మవారు

యానాం: యానాం గోపాల్ నగర్‌లో కొలువైన శారదాదేవి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కాకర్లపర్తి బాబీశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరి అలంకరణలో తీర్చిదిద్దారు. అనంతరం ఉగాది పర్వదినం ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వేగేశ్న గోపాలరాజు, పొన్నాడ వెంకటేశ్వరరావు, చేకూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బాణసంచా అమ్మకానికి వేలం పాట

అల్లవరం: గతేడాది అక్టోబర్ 15న బోడసకుర్రులోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను అల్లవరం పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. దీనిపై అల్లవరం ఎస్ఐ శ్రీను నాయక్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో సీజ్ చేసిన బాణసంచాను బహిరంగంగా వేలం పాట నిర్వహించి విక్రయించాలని అమలాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. కోర్టు ఉత్తర్వులను అనుసరించి అల్లవరం తహసీల్దార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌ల సమక్షంలో ఈ నెల 24న ఉదయం 11 గంటలకు నిందితుడు తులా సత్యనారాయణ ఇంటి వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లుగా ఎస్ఐ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే అభ్యర్థులు బాణాసంచా నిల్వ ఉంచుకునే లైసెన్స్, అమ్ముకునే లైసెన్స్(ఎల్ఈ-1, ఎల్ఈ-2) కలిగి ఉండాలని సూచించారు.

సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ మృతి



శ్రీరామచంద్రమూర్తి

ముమ్మిడివరం: సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ ఆకాశం శ్రీరామచంద్రమూర్తి(71) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక టీటీఆర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతుండగానే గుండెపోటుతో కుప్పకూలిపోవడంతో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఆయన 1987-90 మధ్య కాలంలో జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఐ.పోలవరం: గుత్తినదీవి గ్రామంలోని ఓ ఇంటిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తుల్ని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.31,530 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద ఉగాది వేడుకలు



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న హోంమంత్రి నమశ్శివాయం, స్పీకర్ సెల్వం తదితరులు

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద బుధవారం తెలుగు కొత్త సంవత్సరం శోభాకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా హోంశాఖా మంత్రి నమశ్శివాయం, స్పీకర్ ఆర్.సెల్వం తదితరులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగువారి ఉగాది పర్వదినం సందర్భంగా యానాం నియోజకవర్గ పరిధిలోని తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పుదుచ్చేరిలోని రాజరాజేశ్వరీ నగర్‌లో ఉన్న ఆంధ్ర మహాసభ భవనం వద్ద జరిగిన ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

వైభవంగా సుబ్బాలమ్మ తీర్థం



సుబ్బాలమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు బుధవారం శాస్త్రోక్తంగా జరిగాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి తీర్థానికి పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. స్థానిక చందనబ్రదర్స్ వస్త్రాలయం ప్రతినిధులు భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. శ్రీరామనంద చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చలివేంద్రం ఏర్పాటుచేశారు. జి.రామకృష్ణ ఫ్రెండ్స్ భక్తులకు స్వీటు ప్రసాదాన్ని సమకూర్చారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, ఆలయ ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

కొండాలమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం

ముమ్మిడివరం: కొండాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ఉగాది పచ్చడి స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 18 వేల మట్టి గాజులతో అలంకరించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జీ, ఆలయ కమిటీ చైర్మన్ పెట్టా శివప్రసాద్, చెల్లి అశోక్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నిబంధనల మేరకు పనులు చేయాలి

అంబాజీపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు ప్రభుత్వ నిబంధనల మేరకు చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం శివాలయం రోడ్డులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ రోజుకు కనీస వేతనం వచ్చేలా ప్రతి కూలీ పని చేసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, కముజువారిలంక సర్పంచ్ సరస్వతుల సుబ్రహ్మణ్య ప్రసాద్, వాసంశెట్టి పెదబాబు, వాసంశెట్టి వెంకటశెట్టి తదితరులు ఉన్నారు.

యువజన విభాగం అధ్యక్షుడిగా భానుతేజ



భానుతేజకు కండువా వేసి అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: అమలాపురం రూరల్ మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా బండారులంకకు చెందిన కేతా భానుతేజ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తన నివాసంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో భానుతేజ పేరును ప్రకటించి ఆయనకు పార్టీ కండువా వేసి అభినందించారు. భానుతేజను అభినందించినవారిలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవింద శెట్టి, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్క ఆదినారాయణ తదితరులున్నారు.

అంబులెన్స్ డ్రైవర్ల నిరసన



పుదుచ్చేరి డీఎంఎస్ ఆఫీసు ఎదురుగా నిరసన తెలుపుతున్న అంబులెన్స్ డ్రైవర్లు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న 108 అంబులెన్స్ డ్రైవర్లు తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం పుదుచ్చేరి డీఎంఎస్ ఆఫీసు ఎదురుగా నిరసన చేపట్టారు. తమకు సక్రమంగా జీతాలివ్వాలని, ఇంక్రిమెంట్లు, అలవెన్స్‌లు, బోనస్‌లు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సంఘ అధ్యక్షుడు పురుషోత్తం ఆధ్వర్యంలో సీఎం రంగసామికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

అల్లవరం: బెండమూర్లంక మార్కెట్ సెంటర్ నుంచి ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్ వరకు 10 మీటర్ల వెడల్పున రోడ్డు నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు రూ.7 కోట్లు మంజూరయ్యాయని సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ బుధవారం తెలిపారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సర్వే చేయాల్సి ఉందని, సర్వే పూర్తవ్వగానే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఆర్డీఓని కలిసి త్వరగా సర్వే పూర్తి చేయాలని కోరతామన్నారు. సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన ఎంపీ అనురాధకు సర్పంచ్ మంగాయమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో చేసిన దాడుల్లో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శేరు నూకరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరియాంపేటలో పట్టా కామేశ్వరరావు నుంచి రూ.3,900 విలువచేసే 54 బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆఫీసులో హాజరుపరిచామన్నారు.

చాకుతో తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

యానాం: స్థానిక చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలో బస్‌స్టాప్ వద్ద చాకుతో తిరుగుతున్న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కేతా దుర్గా మహేష్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతడికి ఈనెల 28 వరకు రిమాండ్ విధించారని యానాం ఎస్ఐ నూకరాజు తెలిపారు.

ఎస్‌సీపీ నిధులు వినియోగించలేదు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా గత ఐదేళ్లుగా షెడ్యూల్డ్ క్యాస్ట్ స్పెషల్ కాంపోనెంట్(ఎస్‌సీపీ) నిధులు రూ.925 కోట్లు మంజూరైతే వాటిని ఖర్చుచేయకుండా ఎన్ఆర్‌కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం వెనుకకు మళ్లించారని విదుతలై చిరుతైగల్ కచ్చి(వీసీకే) ప్రిన్సిపల్ సెక్రటరీ దేవపొజిలాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.166 కోట్లు వినియోగించలేదని, ఇలాగైతే ఎస్సీల సంక్షేమం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు.

దశాబ్దాల కల.. నెరవేరుతున్న వేళ

- రూ.35 కోట్లతో నీటి ఎద్దడి నివారణ పనులు
- శరవేగంగా సాగుతున్న 30 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు



కోరంగి పంచాయతీ ప్రతాప్‌నగర్‌లో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు



పటవల పంచాయతీలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు

తాళ్లరేవు: వేసవి వచ్చిందంటే చాలు.. అక్కడ గుక్క పట్టి ఏడ్చినా గుక్కెడు నీళ్లు దొరకవు.. కిలోమీటర్ల దూరంలో ఉన్న బావుల నుంచి దొరికిన కాసింత నీటిని మోసుకుని తెచ్చుకుని తాగాల్సిందే. రక్షిత మంచి నీరు మాత్రం దొరకదు. గ్రామీణ నీటి పారుదల శాఖ గ్రామాల్లోకి పంపించే తాగునీటి ట్యాంకర్ల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి. తాళ్లరేవు మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఏటా వేసవిలో కనిపించే దృశ్యాలివి.. కోరంగి, నీలపల్లి, గాడిమొగ, పి.మల్లవరం, పటవల, చొల్లంగి తదితర పంచాయతీల్లో సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దశాబ్దాలుగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు చర్యలు చేపట్టారు. జలజీవన్ మిషన్ నిధులతో పాటు ఓఎన్‌జీసీ అందిస్తున్న సీఎస్ఆర్ నిధులు కేటాయించి తాగునీటి ట్యాంకులు, ఇంటింటికీ పైపులైన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

17 పంచాయతీల పరిధిలో పనులు

తీర ప్రాంత గ్రామాల ప్రజలను ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. ముఖ్యంగా వేసవి వచ్చిందంటే చాలు గుక్కెడు నీటి కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పాలకులు ప్రజలకు తాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఒక్క తాళ్లరేవు మండల పరిధిలోనే జలజీవన్ మిషన్ నిధులు రూ.24 కోట్లు, ఓఎన్‌జీసీ నిధులు రూ.11 కోట్లు కేటాయించి నీటి ఎద్దడి నివారించేందుకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పనులు ప్రారంభించారు. ఈ మేరకు మండలంలోని 17 పంచాయతీల్లో నిర్మిస్తున్న 30 ఓవర్ హెడ్ ట్యాంకుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 8 ఓవర్‌హెడ్ ట్యాంకుల పనులు పూర్తవ్వగా, మిగిలినవి ఏప్రిల్ నెలాఖరుకి పూర్తవుతాయని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి పథకానికి సైతం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు పటవల, తాళ్లరేవు తదితర పంచాయతీల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆయా పనులు పూర్తయితే ఉప్పంగల తదితర భారీ మంచినీటి చెరువుల నుంచి కొత్తగా నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపించి, అక్కడి నుంచి ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో పనులు చేపట్టారు. తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన పనులతో దశాబ్దాల నాటి తమ కల నెరవేరుతుందంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి



గతంలో వేసవి వచ్చిందంటే కోరంగి, నీలపల్లి, గాడిమొగ, పి.మల్లవరం, పటవల, చొల్లంగి తదితర పంచాయతీల్లో తాగునీటిని పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోయేవాళ్లం. అయితే జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాట్లు పనులు పూర్తవుతుండడంతో ఇకపై తాగునీటి సమస్య ఉండదు. ఏప్రిల్ నెలాఖరు నాటికి పనులన్నీ దాదాపుగా పూర్తవుతాయి.

– తాడిచర్ల మారుతీరావు, అసిస్టెంట్ ఇంజినీర్, గ్రామీణ నీటి పారుదల శాఖ, తాళ్లరేవు మండలం

చాలా ఆనందంగా ఉంది



గతంలో వేసవికాలం వచ్చిందంటే చాలు చుక్క నీటి కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. కొన్నిసార్లు తాగునీరందక ఉప్పు నీరే గతయ్యేది. ప్రస్తుతం తాగునీటి ట్యాంకుల నిర్మాణంతో సమస్య తీరింది. ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా త్వరలో ఇంటి వద్దే తాగునీరు సరఫరా చేస్తామంటున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– సూరంపూడి శ్రీదేవి, పటవల

PUBLIC NOTICE

Sri Kasanakurthi Subrahamaryam, S/o. Venkatreddy, Mummidivaram Mummidivaram Mandal, Dr BR Ambedkar Konaseema Dist - applied for loan from M/s. Shriram Finance Ltd, Chennai, having branch office at Amalapuram the security of the schedule mentioned property of him. If anybody has objection or attachments or any other interest over the properties should inform to the undersigned within 7 days from this day.

Dr BR Ambedkar Konaseema Dist., Mummidivaram SRO Mummidivaram Nagar Panchayat Mummidivaram - Ispe 7 Dry, RS No 665/1 an extent of southern side ac. 0.06 cents = 291 sq yds is bounded by:

E: Land of Moosara Govindarajulu (as per certificate issued by VRO, road is situated);

S: Panta Kalta, W: Land of Poiset Nagaratnam, N: Land of Baggu Nageswara Rao

In between the above boundaries with an R C C residential building therein bearing D No 1-4 with doors, doorways, electrical fittings etc., and with all easement rights etc., therein.

DVVS MURTHY, Advocate
Amalapuram
Date: [illegible]

ప్రకటన

[illegible]

వి.భైరవస్వామి, అడ్వకేట్
డో.నెం.10-262, [illegible],
తాళ్లరేవు - 533 461 సెల్:98487 80849